# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ; 19 ; జూన్ ; 2023

I




### సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 33.721 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 92.597 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) - | రూ.61,240 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) - | రూ.5,500 |
| 3 శాతం జీఎస్టీతో.. - | రూ.5,665 |
| నవర (8 గ్రా) - | రూ.45,320 |

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.9 /29.0

ఆదివారం గాలిలో తేమ 42 శాతం ఉంది. సోమవారం వాతావరణంలో మార్పులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### భారీగా బొగ్గు దిగుమతి



రైలు మార్గంలో బొగ్గు రవాణా చేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా భారీగా బొగ్గు దిగుమతి జరుగుతున్నట్టు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా లైలా నాన్‌టంగ్ అనే నౌక ద్వారా 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది. అలాగే, నావియోస్ అస్ట్రా అనే నౌక నుంచి 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది. అదేవిధంగా నెఫెలి జీఆర్ అనే నౌక నుంచి 76,000 టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది. మరోవైపు బిగ్ ఫిష్ అనే నౌక ద్వారా 1.65 లక్షల టన్నుల సున్నపురాయి దిగుమతి చేసుకుంటున్నారు.

### 24 వరకు ఒంటిపూట బడులు

నెల్లూరు(టౌన్): ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 24వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ గంగాభవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో రాగిజావ, 11.30 నుంచి 12 గంటల మధ్యలో మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు.

### నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు సోమవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

### భార్యతో విభేదించి ఆస్ట్రేలియాకు భర్త జంప్!

ఒంగోలు టౌన్: అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా తనకు తెలియకుండా తన భర్త ఆస్ట్రేలియా వెళ్లిపోయాడని ఓ వివాహిత ఆదివారం ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన తుమాటి మనీషాకు నెల్లూరు జిల్లా కావలికి చెందిన నాతాని వెంకటేశ్‌తో గతేడాది ఫిబ్రవరిలో వివాహమైంది. వివాహ సమయంలో రూ.1.30 కోట్ల విలువ చేసే పొలంతోపాటు ఆడపడచు కట్నం, పెళ్లి ఖర్చులు, బంగారం నగలు కలిపి రూ.15 లక్షలు ముట్టచెప్పారు. కావలిలో కాపురం పెట్టిన తరువాత అత్తామామలు నాతాని యానాదినాయుడు, అరుణలతోపాటు ఆడపడచు కంతమణి వెంకటశేషమ్మ అలియాస్ శైలజ వేధించడం మొదలుపెట్టారు. దీంతో మద్దిరాలపాడు గ్రామంలో కాపురం పెట్టారు. కాపురం సజావుగా సాగుతున్న సమయంలో అత్తామామలు, ఆడపడచులు వచ్చి భార్యాభర్తల మధ్య గొడవలు సృష్టించారు. రూ.20 లక్షలు అదనపుకట్నం తెస్తేనే కావలికి కాపురానికి తీసుకొని వెళతామని చెప్పి వెంకటేశ్‌ను వెంట తీసుకెళ్లారు. వీరితోపాటు భర్త బంధువులైన మద్దినేని శ్రీహరి, శ్యామలాదేవి పదేపదే మనీషా ఇంటికి వచ్చి వెంకటేశ్‌కు విడాకులు ఇస్తే రూ.30 లక్షలకు సెటిల్ చేస్తామని నచ్చజెప్పే ప్రయత్నాలు చేశారు. కాగా గతేడాది ఆగస్టులోనే వెంకటేశ్ తనకు చెప్పకుండా ఆస్ట్రేలియాకు వెళ్లిపోయినట్లు తెలిసిందని భార్య మనీషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధి భరోసా

- వలసల నివారణ.. సొంతూళ్లలోనే పనులు
- సద్వినియోగం చేసుకుంటున్న గ్రామీణులు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఎప్పటి వేతనాలు అప్పుడే అందేలా చర్యలు

### వ్యవసాయ పనులు లేని వేసవిలో గ్రామీణ పేదలకు అండ

ఉపాధి పనులు గ్రామీణ పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. వేసవిలో పనుల కోసం పట్టణ, నగరాలకు వలస పోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సొంతూళ్లలోనే పనులు కల్పిస్తోంది. దీంతో గ్రామీణ ప్రజలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ 10వ తేదీ వరకు జిల్లాలో సుమారు 62 లక్షల మంది ఉపాధి పనులకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.



వింజమూరు మండలం కాటేపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉదయగిరి: జిల్లాలో నెల్లూరు, కందుకూరు, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి క్లస్టర్ల పరిధిలో గ్రామీణ ప్రజలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటూ వేసవిలో మంచి వేతనం పొందుతున్నారు. వ్యవసాయ పనులు లేని ఈ వేసవిలో పేదలు వలస పోకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా ఉపాధి సిబ్బందిని అప్రమత్తం చేసి రోజూ పనులకు వెళ్లేలా అవగాహన కల్పించింది. ఎండ తీవ్రత లేని వేళల్లో పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి ఉపాధి కూలీ రూ.275 గరిష్ట వేతనం పొందేలా కొలతలు నిర్ణయించి పనులు చేస్తున్నారు. జిల్లాలో రోజుకు సగటు కూలీ రూ.248 పొందుతున్నట్లు తెలుస్తోంది.

**పెండింగ్ లేకుండా వేతనాలు**

జిల్లాలో ఉపాధి పనులకు 65 శాతం వరకు మహిళలు హాజరువుతున్నారు. కుటుంబ పోషణలో ముఖ్య పాత్ర పోషిస్తున్న మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం సకాలంలో కూలీ నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మే 22వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన కూలీ నగదును పూర్తిగా కూలీలకు అందజేసింది. మరో వారం రోజుల్లో 15 రోజులకు సంబంధించిన కూలీ నగదు కూడా అందుతుందని అధికారులు చెబుతున్నారు.

#### ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి



వేసవిలో ఉపాధి పనులతో ఎంతో ప్రయోజనం పొందుతున్నాం. పనులు లేని రోజుల్లో ఉపాధి పనులు చేసుకుంటూ ఆర్థిక సమస్యలు లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మంచి కూలీ వస్తోంది. వేసవిలో 100 రోజులు పనులు పూర్తి చేస్తాం. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు చేసుకుంటాం. కూలీ నగదు సకాలంలో బ్యాంకు ఖాతాలో వేస్తున్నారు. – శ్రీనివాసరెడ్డి, కూలీ, ఉదయగిరి మండలం

#### పనులపై అవగాహన కల్పిస్తున్నాం



నెలలో రెండో శుక్రవారం ఉపాధి కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి హక్కుల గురించి తెలియజేస్తున్నాం. పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పిస్తున్నాం. గరిష్ట వేతనం ఎలా పొందాలో తెలియజేసి వారికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. – జె.నాగరాజు, ఏపీఓ, వింజమూరు

#### గ్రామీణ పేదలకు ఎంతో ప్రయోజనం



ఉపాధి పనుల ద్వారా గ్రామీణ పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. వ్యవసాయ పనులు లేని వేసవిలో పేద కుటుంబాలను ఈ పనులు ఆదుకుంటున్నాయి. పనులు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ వేసవిలో కూలీలు 100 రోజులు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. – వెంకట్రావ్, డ్వామా పీడీ, నెల్లూరు

### జిల్లాలో..

ఉపాధి పనులకు రోజూ హాజరవుతున్న కూలీలు
**సుమారు లక్ష మంది**

వేసవిలో కూలీలకు అందిన వేతనాలు - **రూ.130 కోట్లు**

### పనులు భేష్

గత నాలుగేళ్లలో ప్రభుత్వం వ్యవసాయ పనులు లేని వేసవిలో గరిష్టంగా ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటూ గ్రామీణ ప్రజలకు అండగా నిలుస్తోంది. సకాలంలో వేతనాలు ఇస్తూ ఆర్థికంగా ఆదుకుంటోంది. జిల్లాలో రోజుకు 1.20 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా లక్ష్యం నిర్దేశించుకోగా, లక్ష మంది వరకు పనులకు హాజరవుతున్నారు. బుధవారం రోజు 96,570 మంది కూలీలు జిల్లాలో ఉపాధి పనులు చేశారు. అత్యధికంగా ఉదయగిరి క్లస్టర్‌లో 25 వేల మందికి పైగా పనులు చేశారు. కందుకూరులో 22,918, ఆత్మకూరులో 14,283, కోవూరులో 14,359, నెల్లూరులో 19,654 మంది బుధవారం ఉపాధి పనులు చేశారు. ఉపాధి పనుల కల్పనలో గతేడాది జాతీయస్థాయిలో జిల్లాకు అవార్డు రావడం తెలిసిందే. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచేలా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు.



ఉదయగిరి మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ గాయత్రీదేవి (ఫైల్)

### ‘జగనన్న సురక్ష’పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



వెబ్‌ఎక్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంపై జిల్లా, మండల, గ్రామస్థాయి వరకు అధికారులందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అలాగే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంపై జిల్లా, మండలస్థాయి అధికారులకు వెబ్‌ఎక్స్ సమావేశం ద్వారా కలెక్టర్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ నెల 23న ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని, ఈ నెల 24న గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలలో జగనన్న సురక్షపై అవగాహన కల్పించి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. మండలానికి రెండు టీంలు ఏర్పాటు చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి నెల రోజులపాటు ఏ తేదీన ఏ గ్రామాలకు వెళ్తారో షెడ్యూల్ రూపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలు తెలుసుకుని అవసరమైన సర్టిఫికెట్లు అక్కడే అందజేయాలని తెలిపారు. మే 9వ తేదీ నుంచి జరగనున్న ‘జగనన్నకు చెబుదాం’లో పరిష్కారమైన సమస్యలను అర్జీదారులకు వివరించాలని కలెక్టర్ సూచించారు. వెబ్‌ఎక్స్ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, పీడీ డ్వామా వెంకట్రావ్, సుస్మితారెడ్డి, ఆర్డీఓలు, జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు



మంత్రి కాకాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరులోని డైకాస్‌రోడ్డులో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు మంత్రి కాకాణిని మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, ఉద్యోగులకు సంబంధించి సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి మహత్తర కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. 10 వేలకు పైగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో తాను భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు.

**సాహసోపేతమైన నిర్ణయం : ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి**

సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ కేబినెట్‌లో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వారి జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీలో పనిచేస్తున్న సుమారు 50 వేల మందిని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. అలాగే 24 సంవత్సరాల నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న 4 వేల మంది 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. 2008 డీఎస్సీలో క్వాలిఫై అయి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చి వారు కోరుకున్న దానికన్నా మినిమం టైం స్కేల్‌ను అమలు చేయడం ఈ ప్రభుత్వంలోనే సాధ్యమైందని తెలిపారు. తొలుత కేక్ కట్ చేసి జై జగన్ అంటూ నినాదాలు చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌వర్మ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

# సంక్షేమానికి చేరువ చేస్తూ..

జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారుల భవితకు భరోసా ఇచ్చేలా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులు ఆధార్ పొందలేక సంక్షేమానికి దూరమవుతున్న నేపథ్యంలో ఆధార్ అనుసంధానికి అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా కలెక్టర్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికి 2,874 మంది పిల్లలకు ఈ పత్రాలు అందించారు.

- అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు
- ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ లేక ఇబ్బందులు
- జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ద్వారా పత్రాల పంపిణీ
- కలెక్టర్ చొరవపై తల్లిదండ్రుల అభినందనలు



జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆధార్ లేని చిన్నారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని, ఆధార్ పొందేందుకు అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా కలెక్టర్ ఎం.హరినారాయణన్ చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు, ఆయా ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులు 1,37,232 మంది అభ్యసన చేస్తున్నారు. వారిలో 64,335 మంది చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవని అధికారులు గుర్తించారు. కాగా చిన్నారులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో పౌష్టికాహారంతోపాటు రేషన్ పొందలేకపోతున్నారు.

**ప్రత్యేక ప్రణాళిక**

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తూ ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు కూడా పౌష్టికాహారం అందిస్తోంది. ప్రత్యేకించి ప్రీ స్కూల్స్ ద్వారా ఎల్‌కేజీ, యూకేజీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్‌కార్డు లేక సంక్షేమానికి దూరమవుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా సమీక్ష సమావేశాల్లో కలెక్టర్ గుర్తించి వెంటనే ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో డివిజనల్ స్థాయి పంచాయతీరాజ్‌శాఖ అధికారితోపాటు మండలస్థాయిలో మండల అభివృద్ధి అధికారులు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బందితోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు కలిపి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా అధికారులు బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారిని గుర్తించారు. ఇప్పటికే జిల్లాలో 64,335 మంది చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేనందున ఆధార్ కార్డు పొందలేకపోయారు. వారందరికీ ఈ పత్రాలు అందించి సులువుగా ఆధార్ కార్డు పొందే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 2,874 మంది చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

**కలెక్టర్ చొరవపై ప్రశంసలు**

జిల్లాలో 60 వేల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు ఆధార్ కార్డు పొందలేకపోయారు. అందులో చాలా మంది చిన్నారుల తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో ఆధార్ కార్డు పొందలేకపోయినట్లు తెలిసింది. కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

#### సద్వినియోగం చేసుకోవాలి



ఐదేళ్ల లోపు చిన్నారులు జనన ధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ కార్డు పొందలేకపోయారు. దీని వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరమయ్యారు. ఈ విషయం గుర్తించి వెంటనే పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. – ఎం.హరినారాయణన్, కలెక్టర్

## పేకాట స్థావరాలపై దాడులు

- 18 మంది జూదరుల అరెస్ట్
- రూ.72,639 నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని రెండు పేకాట స్థావరాలపై సంతపేట, వేదాయపాళెం పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పేకాటాడుతున్న 18 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.72,639 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేట మండలం హసనాపురానికి చెందిన కె.ప్రభాకర్‌రెడ్డి నగరంలోని బృందావనంలో ఓ గదిని అద్దెకు తీసుకుని గత కొంతకాలంగా పేకాట నిర్వహిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు ఆదివారం తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. నిర్వాహకుడితోపాటు మరో 9 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.42,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

**రియల్ ఎస్టేట్ ముసుగులో..**

రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తోన్న పేకాట స్థావరంపై వేదాయపాళెం పోలీసులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నిప్పోసెంటర్‌లోని ఎస్.నంజీవయ్యనాయుడు, వేదాయపాళెం రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన డి.మోహన్‌రావు రియల్ ఎస్టేట్ వ్యాపారులమంటూ బుజబుజనెల్లూరులోని మూడంతస్తుల భవనంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. అక్కడ గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారు. దీనిపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణకు పక్కా సమాచారం అందింది. నిఘా ఉంచి ఆదివారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకులతోపాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.30,389 నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆ ఇల్లు ఓ టీడీపీ నాయకుడిదని సమాచారం. నిందితులు తరచూ తమిళనాడు సరిహద్దులోని ఓ క్లబ్‌లో పేకాట ఆడేవారని, అక్కడకు వెళ్లే తీరిక లేని సమయంలో రియల్ ఎస్టేట్ కార్యాలయంలోనే పేకాట నిర్వహిస్తారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రజలు తమ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100, 112 లేదా తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## సముద్ర స్నానానికి వెళ్లి..

- ఇద్దరు యువకుల మృత్యువాత
- రామతీర్థంలో ఘటన

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలంలోని రామతీర్థంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన సర్వేపల్లి కార్తీక్(17), బండ్ల కళ్యాణ్(16), బొందిలి సాయిభార్గవ్ రామతీర్థం వద్ద సముద్రంలో స్నానానికి వెళ్లారు. ముగ్గురూ ఒకేచోట మునుగుతున్న సమయంలో కార్తీక్, కళ్యాణ్ కొంచెం లోతులోకి వెళ్లారు. వారి కోసం సాయిభార్గవ్ కూడా వెళ్లగా ముగ్గురూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లిపోయారు. దీనిని గమనించిన మెరైన్ సిబ్బంది, పోలీసులు, గజ ఈతగాళ్లు వారిని రక్షించేందుకు విశ్వప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న సీఐ గంగపట్నం రామారావు ముగ్గురినీ కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ సాయిభార్గవ్‌ను మాత్రమే రక్షించగలిగారు. కార్తీక్, కళ్యాణ్‌లను ఒడ్డుకు చేర్చి, ఇరువురినీ రామతీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటివరకు తన ఎదుట ఉన్న బిడ్డలు గంటల వ్యవధిలోనే మృతదేహాలుగా మారడంతో రెండు కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోయాయి.



కార్తీక్, కళ్యాణ్ మృతదేహాలు

**ఎమ్మెల్యే ప్రసన్న సంతాపం**

కోవూరు నియోజకవర్గానికి చెందిన పార్లపల్లి గ్రామంలోని ఇద్దరు యువకులు రామతీర్థంలో సముద్రస్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారన్న విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ తల్లిదండ్రులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటూ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్

• ఇప్పటి వరకు 68 చోట్ల ఏర్పాటు

నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నగదు లావాదేవీలకు సంబంధించి డిజిటల్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో విడతల వారీగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం 165 ప్రభుత్వ మద్యం దుకాణాలుండగా తొలివిడతలో 31, రెండో విడతలో 37 మొత్తంగా 68 చోట్ల ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు మద్యం దుకాణాలకు కార్డులను స్వైపింగ్, స్కాన్ చేసే మెషీన్లు అందజేశారు. అయితే క్రెడిట్‌కార్డు స్వైపింగ్, క్యూఆర్ స్కాన్ మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉంది. గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎంలు ఉన్నవారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్యం బాటిళ్లను కొనుగోలు చేయొచ్చు. కొనుగోలు చేసే నగదు మొత్తం ఎక్సైజ్ శాఖకు సంబంధించిన బ్యాంకులకు జమవుతుంది. నెలాఖరులోపు అన్ని దుకాణాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి కె.వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు.

### ఆటో బోల్తా.. వ్యక్తి దుర్మరణం

పొదలకూరు: పట్టణంలోని రామ్‌నగర్‌గేటు సెంటర్‌లో ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం ఇందూరుకండ్రిగ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆటోలో కలువాయి మండలం చింతలాత్మకూరు గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో ఉన్న వ్యక్తులు పట్టణంలోని గేటుసెంటర్‌లో కూల్‌డ్రింక్స్ తాగి మనుబోలు మార్గంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిల్లకూరు గిరి (42)పై ఆటో పడడంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్‌కే కరిముల్లా ఘటనా స్థలానికి చేరుకుని దగ్గరలోనే ఉన్న సీహెచ్‌సీకి గిరిని తరలించాడు. అయితే అప్పటికే అతడు మృతిచెందాడు. ఆటో డ్రైవర్, మరో వ్యక్తి భయపడి పరారైనట్లుగా చెబుతున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళపై దాడి

• పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

కావలి రూరల్: పట్టణానికి చెందిన కరకమిట్ల పార్వతి అనే మహిళపై దాడి చేయడంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆపై స్టేషన్ ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి జరిగింది. ఒకటో పట్టణ సీఐ కె.శ్రీనివాసరావు ఆదివారం వివరాలు వెల్లడించారు.. స్థానిక పాతవూరుకు చెందిన పార్వతికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త చనిపోయాడు. పట్టణంలో పండ్లు, కూరగాయ వ్యాపారం చేసుకుంటున్న దర్శిగుంట మహేంద్ర అనే వ్యక్తి దగ్గర ఆమె వడ్డీకి నగదు తీసుకుని శివాలయం వీధిలో పార్వతి ప్రొవిజన్స్ దుకాణం ఏర్పాటు చేసుకుంది. వడ్డీతో సహా నగదు చెల్లించానని పార్వతి చెబుతోంది. మళ్లీ మహేంద్ర అక్క నాగలక్ష్మి వద్ద వడ్డీకి నగదు తీసుకున్నాని, కొంత చెల్లించానని, మిగిలిన నగదు చెల్లించేందుకు ఆలస్యం కావడంతో అధిక వడ్డీలు వేసి వేధించారని ఆమె వాపోతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి మహేంద్ర, నాగలక్ష్మి, మరో నలుగురు తనపై దాడి చేసినట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అందరి ముందు దాడి చేశారని అవమానంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### బస్సులో నుంచి పడి వృద్ధురాలి మృతి



కాంతమ్మ మృతదేహం

ఉదయగిరి: మండలంలోని యర్రబల్లిగడ్డ సెంటర్ వద్ద ఓ వృద్ధురాలు ఆర్టీసీ బస్సులో నుంచి కింద పడి తలకు తీవ్ర గాయమై మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శకునాలపల్లి గ్రామానికి చెందిన అంబవరపు కాంతమ్మ (62) సీతారామపురం నుంచి స్వగ్రామానికి వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. యర్రబల్లిగడ్డ వద్దకు వచ్చేసరికి కండక్టర్ యర్రబల్లిగడ్డ అని అరవడంతో వృద్ధురాలు ఒక్కసారిగా బస్సులో నుంచి కిందకు దిగింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.



# కార్గో సేవలు భేష్

ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌లకు దీటుగా ఏపీఎస్ ఆర్టీసీ అనుబంధ విభాగమైన కార్గో నిలబడింది. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రతి సంవత్సరం సంస్థకు ఆదాయ వనరుగా ఉంది. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు బస్సుల ద్వారా పార్సిల్, వస్తు రవాణాను వేగవంతంగా అందిస్తోంది. దీంతో వ్యాపార వర్గాల్లో ఆర్టీసీ కార్గోపై ఆదరణ పెరుగుతోంది.

- జిల్లాలో 48 ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటు
- పార్సిల్ సర్వీస్‌లో ఆర్టీసీకి ఏటా లాభాలు
- ప్రధాన బస్టాండ్‌లోని పార్సిల్ సర్వీస్ నుంచే 70 శాతం రాబడి



నెల్లూరులోని పార్సిల్, కొరియర్ సర్వీస్ కార్యాలయం

నెల్లూరు సిటీ: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 48 కార్గో కేంద్రాలున్నాయి. 2016 వరకు ఏఎన్‌ఎల్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా పార్సిల్ సర్వీసును అందించింది. 2017 నుంచి దశల వారీగా ఆర్టీసీ కార్గోను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. దీనికి ప్రజల నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, కడప, ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఒకేరోజులో వస్తువులను అందజేయగలుగుతోంది.

**నాణ్యమైన సేవలు**

కార్గో నాణ్యమైన సేవలు అందిస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిత్యం ఉండడంతో తమ పార్సిల్స్‌ను ఆయా వాటిల్లో సరఫరా చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థల ద్వారా పంపే విలువైన వస్తువులకు రక్షణ ఉండే అవకాశం తక్కువ. ఈ క్రమంలో ఆర్టీసీ కార్గో పనితీరు మెరుగ్గా ఉండడంతో పార్సిల్, కొరియర్లను పంపించేందుకు జిల్లా వాసులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యమైన సేవలు అందించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. నిరుద్యోగులు, ఆసక్తి కలిగిన వారు జిల్లా వ్యాప్తంగా లాజిస్టిక్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ కార్గో మేనేజర్ దివ్య కామాక్షి తెలిపారు. 7331147267, 73828 85993 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.



కొరియర్ బుక్ చేసుకుంటున్న సిబ్బంది

| ఆర్థిక సంవత్సరం | రాబడి |
|---|---|
| 2020 - 21 | రూ.4.64 కోట్లు |
| 2021 - 22 | రూ.6.37 కోట్లు |
| 2022 - 23 | రూ.9.83 కోట్లు |
| 2023 - 24 (ఏప్రిల్, మే నెలల్లో) | రూ.2.9 కోట్లు |

**నాణ్యమైన సేవలు అందిస్తున్నాం**



పార్సిల్, కొరియర్ సర్వీస్‌ల్లో నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. ప్రజలకు మరింత సేవలు అందించేందుకు జిల్లా, నగరంలో ఏపీఎస్‌ఆర్‌టీసీ ద్వారా లాజిస్టిక్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. నిరుద్యోగులు, ఆసక్తి కలిగిన వారు సంప్రదించాలి.

– దివ్య కామాక్షి, ఆర్టీసీ కార్గో మేనేజర్

**ఏటా రాబడి పెరుగుతోంది**



కార్గో ద్వారా ఆర్టీసీకి రాబడి వస్తోంది. ఇది ప్రతి ఏటా పెరుగుతోంది. ఆర్టీసీ కార్గో ద్వారా కొరియర్, పార్సిల్ సర్వీస్‌లను వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

– పీవీ శేషయ్య, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

# నెల్లూరులో 23 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణం

• మేనేజింగ్ పార్ట్‌నర్ గిలకా నరేంద్ర



మాట్లాడుతున్న నరేంద్ర

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలో మొట్టమొదటిసారిగా 23 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని చేపట్టినట్లు యూనిక్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ గిలకా నరేంద్ర వెల్లడించారు. నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు హరనాథపురంలో ఉన్న యూనిక్ ప్రాజెక్ట్స్ సైట్ ఆఫీస్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా నగరాల్లో నిర్మిస్తున్న విలాసవంతమైన అపార్ట్‌మెంట్లకు దీటుగా అన్ని సౌకర్యాలతో తాము చేపట్టిన ఈ ప్రాజెక్ట్ నెల్లూరు నగరానికే ఐకాన్‌గా నిలిచిపోనుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పాతికేళ్లకుపైగా అనుభవంతో, తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో వెంచర్లను దిగ్విజయంగా పూర్తి చేసిన తాను మేనేజింగ్ పార్ట్‌నర్‌గా యూనిక్ ప్రాజెక్ట్స్ ప్రారంభించానన్నారు. నిర్మాణ రంగంలో నిష్ణాతులైన బృందంతో, సరికొత్త పద్ధతులను అనుసరిస్తూ, నాణ్యతకు పెద్దపీట వేసి అద్భుతమైన ఆకాశ హర్మ్యం 'యూనిక్ స్పైర్' నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. విలాసవంతమైన జీవనశైలి కోరుకునే కుటుంబాలకు అత్యాధునిక గృహాలను అందించడమే లక్ష్యంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సదుపాయాలతో 23 అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. నాలుగు బెడ్‌రూములతో 4,311 నుంచి 4,770 చదరపు అడుగుల వైశాల్యంతో విశాలమైన 80 అపార్టుమెంట్లు నిర్మించడం జరుగుతోందన్నారు. స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, స్పా, యోగా, మెడిటేషన్ హాల్, బ్యాంకెట్ హాల్, మల్టీపర్పస్ హాల్ వంటి ఇండోర్ సదుపాయాలతో ల్యాండ్ స్కేప్డ్ గార్డెన్స్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, టెన్నిస్ కోర్ట్, జాగింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఎల్డర్స్ సీటింగ్ ప్లాజా తదితర అవుట్‌డోర్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా కార్లు పార్కింగ్ ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌ను మూడు సంవత్సరాల్లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | రూ.35 |
| సన్నవి | రూ.20 |
| పండ్లు | రూ.7 |

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | | | |
|---|---|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | 176 | స్కిన్‌లెస్ | 326 |
| లేయర్ (లైవ్) | 108 | లేయర్ చికెన్ | 184 |
| బ్రాయిలర్ చికెన్ | 296 | | |
| బ్రాయిలర్ | | | |

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నెల్లూరీయుల ప్రతిభ

నెల్లూరు(టౌన్): ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఇందులో నెల్లూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4 వేలమందికి పైగా హాజరయ్యారు. జాతీయ స్థాయిలో లోహిత్ ఆదిత్యసాయి, జి.ప్రణీత్, మేఘన, అర్జున్, లిఖిత్ శ్రీనివాస్ మంచి ర్యాంకులు సాధించారు.

**సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా**



మేము నెల్లూరు నగరంలోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాం. తండ్రి శ్రీనివాసరావు సివిల్ ఇంజినీర్. తల్లి వరలక్ష్మి. ఇంటర్‌లో 974 మార్కులొచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 108 ర్యాంకు సాధించా. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడడమే నా లక్ష్యం.

– లోహిత్ ఆదిత్యసాయి

**175వ ర్యాంకు వచ్చింది**



మేము నెల్లూరు నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నివాసం ఉంటున్నాం. తండ్రి వరప్రసాదరావు, తల్లి ప్రభావతి వైద్యులుగా పనిచేస్తున్నారు. ఇంటర్‌లో 979 మార్కులొచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 175వ ర్యాంకు సాధించా. ఐఐటీలో చేరడమే నా లక్ష్యం.

– జి.ప్రణీత్

**ఇంటర్‌లో 980 మార్కులు**



మేము నారాయణ మెడికల్ కళాశాలలో నివాసం ఉంటున్నాం. తండ్రి సాంబశివారెడ్డి, తల్లి శ్రీదేవి వైద్యులుగా పనిచేస్తున్నారు. ఇంటర్‌లో 980 మార్కులు సాధించా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 430వ ర్యాంకు వచ్చింది.

– మేఘన

**పెద్ద కంపెనీలో ఉద్యోగమే లక్ష్యం**



మేము హరనాథపురంలో నివాసం ఉంటున్నాం. తండ్రి కృష్ణదేవరాయ వ్యాపారం చేస్తున్నారు. తల్లి రూపవాణి గృహిణి. ఇంటర్‌లో 978 మార్కులు సాధించా. జేఈఈ అడ్వాన్స్ డ్‌లో 1,431వ ర్యాంకు సాధించా. పెద్ద కంపెనీలో ఉద్యోగమే నా లక్ష్యం.

– లిఖిత్ శ్రీనివాస్

**సాఫ్ట్‌వేర్ జాబ్ నా కల**



మేము మాగుంటలేవుట్‌లో నివాసం ఉంటున్నాం. తండ్రి సుమన్ డాక్టర్. తల్లి మంజువాణి గృహిణి. ఇంటర్‌లో 971వ ర్యాంకు సాధించా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 471వ ర్యాంకు సాధించా. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నా కల.

– కె.అర్జున్

**369వ ర్యాంకు**



చైతన్య కుమార్

గుడ్లూరు: గుడ్లూరుకు చెందిన గొర్రెపాటి చైతన్యకుమార్ చౌదరి 369వ ర్యాంకు సాధించాడు. ఇతనికి ఏపీ ఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయిలో 75వ ర్యాంకు వచ్చింది. దీంతో చైతన్యకుమార్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

**14వ ర్యాంకు**



కందుకూరు: పట్టణానికి చెందిన పొడపాటి వెంకట సాయిసాత్విక్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 14వ ర్యాంకు సాధించాడు. ఆదివారం పామూరు రోడ్డులోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో సాత్విక్‌ను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్ బెజవాడ నరేంద్రబాబు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ జి.బాలభాస్కర్ పాల్గొన్నారు.

# విశ్వసాయి విద్యార్థుల విజయకేతనం




ప్రతిభ చూపిన విద్యార్థులతో విశ్వసాయి యాజమాన్యం

నెల్లూరు(టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. నెల్లూరు మాగుంటలేవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో హృతిక్ 112, ప్రశాంత్ 1,931, తనుశ్రీ 3,315, సిసిర్ రెడ్డి 3,508, యజ్ఞశ్రీ 892, యువదీప్ 1,521 ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్షం కురిసిన సమయంలో..



ఎండలో ఇలా..

## కాసేపు వర్షం.. తర్వాత ఎండ

నెల్లూరులో ఆదివారం ఉదయం వర్షం కురిసింది. అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతుండగా ఒక్కసారిగా వాన పడడంతో ఉపశమనం పొందారు. అయితే ఎక్కువ సేపు ఆ వాతావరణం ఉండలేదు. తర్వాత ఎండ వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మంచి మాట



# సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు ఇష్టం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మనాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అములులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి


# నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హి ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచక్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.



పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

# భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

## సినిమా



రవితేజ

# గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.


# వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ



మహేశ్‌బాబు

# నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# మా నాన్న సూపర్ హీరో!



సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

# ఇదేం జీవితం?



రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్‌ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్‌ఎస్ శాన్నీ.

# రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. ఛాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..**

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

# హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత



అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

# సంక్రాంతికి జాతర



ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.